2 లో..



## మోడల్ కాలేజీ విద్యార్థినికి కలెక్టర్ సత్కారం

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



Yadadri Temple

నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

సోమవారం 18 మే 2026 పేజీలు : 14



## పాడే మోసి....శౌరి కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి వివేక్

### సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోడి రెక్క శౌరికి ఘన నివాళులు

**మిర్యాలగూడ, మే 17, ( ప్రజాజ్యోతి ):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ కో?డిరెక్క శౌరి శనివారం మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారంమిర్యాలగూడకు చేరుకొని వినోభానగర్ ఆర్సిఎం చర్చిలో జరిగిన అంత్యక్రియల ప్రార్ధనలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్),...మిగతా 2లో



## పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

**చిట్యాల మే 17(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని ...మిగతా 2లో

# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు10 వేల రూపాయల బహుమతి అందజేత

పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ మే 27(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

భవిష్యత్తుకు బలమైన పునాది విద్య అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా,...మిగతా 2లో

## రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన

**– హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి : ట్రాఫిక్ సీఐ విజయమోహన్**

చౌటుప్పల్, మే 17 (ప్రజా జ్యోతి ): వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ విజయమోహన్ సూచించారు. ఆదివారం పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణాల్లో స్వీయ రక్షణే ప్రధానమని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడం వల్లే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు



## ప్రతిభ చాటిన విద్యార్థినికి కలెక్టర్ సన్మానం

**చింతలపాలెం, మే 17 (ప్రజా జ్యోతి):**

సాఫ్ట్‌బాల్ నేషనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన దొండపాడు గ్రామానికి చెందిన విద్యార్థినికి సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదివారం సన్మానించారు. మండలంలోని దొండపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని గుగులోతు కావ్యశ్రీ క్రీడారంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రత్యేక గుర్తింపు పొందింది. సూర్యాపేట జిల్లా నుంచి తొలిసారిగా సాఫ్ట్‌బాల్ నేషనల్ పోటీలకు ఎంపికైన ఆమె, ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ విద్యార్థినిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కావ్యశ్రీ సాధించిన విజయం జిల్లా విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎం. సత్తిరెడ్డి, పీఈటీ క్రాంతికుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య విద్యార్థులు బాగా చదవాలి

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 10 వేల రూపాయల బహుమతి అందజేత

## పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన




విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. కేజీబి వి మరియు మోడల్ స్కూల్‌లకు చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా





కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఎంఈఓ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు హాజరయ్యారు.

# మోడల్ కాలేజీ విద్యార్థినికి కలెక్టర్ సత్కారం



నిడమానూరు,మే17(ప్రజాజ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యా విజయోత్సవంలో భాగంగా ఆదివారం ఇంటర్ లో జిల్లా స్థాయి ద్వితీయ ర్యాంక్ సాధించిన నిడమనూరు మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థిని పెందోటి భావనను నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ ,డిఐఈఓ దస్రు నాయక్, డీఈవో భిక్షపతి లు ఘనంగా సత్కరించారు. 986 మార్కులు సాధించిన భావనకు రూ. 10వేల నగదు బహుమతి అందించారు. అనంతరం పలువురు భావనను అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లావూరి వెంకన్న, కళాశాల ప్రిన్సిపల్ బి నిర్మల ,తల్లిదండ్రులు పెందోటి నాగరాజు, శిరీష లు హాజరైయ్యారు .

# పాడే మోసి....శౌరి కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి వివేక్

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోడి రెక్క శౌరికి ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. శౌరి పార్థివ దేహం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు భార్య జేసింత,కుమారులు కిరణ్ కుమార్, ఇళయరాజా, ఝాన్సీ లను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు.



శవరీతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి వెంకటస్వామి కి అనుచరుడిగా గుర్తింపు పొందారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవను గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్యే బివిఎల్ఆర్ తో కలిసి శవపేటికను మోశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగిడి రాంలింగయ్య యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, గుడిపాటి నవీన్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ముండ్లగిరి కాంతయ్య, కౌన్సిలర్లు కోడిరెక్క ఇంద్రకుమార్, దైద సోము సుందర్, ఫారుక్, ఆడోత్ అశోక్, మొయిజ్ లు తదితరులు పాల్గొన్నారు.




# పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పి విదేశాల్లో మోడీ ఎంజాయ్ చేస్తున్నాడని వారు ఎద్దేవ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చిట్యాల మండల ఏనిమిదవ మహాసభ కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన జరగగా ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా నారి ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో పేదలు మరింత పేదలుగా ధనికులు మరింత ధనికులుగా పెరిగిపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామీణ వ్యవసాయ కూలీలు, పేదలు పని దొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, చట్టాలు కాల రాయబడుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉపయోగపడే ఉపాధి హామీ పనిని విబి- జి రామ్ జి పథకముగా మార్చి చట్టానికి ఉరేశారని అన్నారు. రోజురోజుకు కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ పెరగడం వల్ల రిజర్వేషన్లు మొత్తం పోయి పేదలకు ఉన్న కాస్త ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందే పరిస్థితిలో లేవని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ కూలీలు వ్యవసాయతర కార్మికులుగా మారారని వారందరికీ ఉపాధి కోసం సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చి పెరుగుతున్న ధరల కనుగుణంగా కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో దేశవ్యాప్తంగా పేదల సమస్యల పరిష్కారం కోసం, భూ పంపిణీ కోసం, ఉపాధి రక్షణ కోసం అన్ని వర్గాలను సమీకరించి పోరాటాలను కొనసాగిస్తామని వారు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కత్తుల లింగస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పథకం అమలు నోచుకోలేదని వ్యవసాయ కూలీలతో ఓట్లు వేసుకుని గద్దనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పొట్టలు కొట్టి పాలనా కొనసాగిస్తున్నారని తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎర్రటి ఎండ లో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని చేసిన కష్టానికి వారం వారం వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని సంబంధిత అధికారులకు చెప్పినప్పటికీ చలనం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల పొట్ట కొట్టి వారి ఆకలి చావులకు ప్రభుత్వాలు బాధ్యత వాయించాల్సి వస్తుందని, గత ప్రభుత్వాల తీరుగా ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విమర్శించారు. ఈ మహాసభలో ఐఎంపిఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరూరి శ్రీనివాస్, సంగం మండల అధ్యక్ష కార్యదర్శులు కల్లూరు కుమారస్వామి, మెట్టు పరమేష్, మండల ఉపాధ్యక్షులు రెడపాక మల్లయ్య, గోపగోని వెంకన్న మాజీ సర్పంచ్ ఎల్లయ్య, లీలావతి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. మండల నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా మెట్టు పరమేష్, అధ్యక్షులుగా కోనేటి రాములు, ఉపాధ్యక్షులుగా ఊడుగు లీలావతి, లడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు కుమారస్వామి, సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్న ట్రాన్స్‌జెండర్స్

## మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కమ్యూనిటీ




**కొండమల్లేపల్లి, మే 17, (ప్రజాజ్యోతి):**

మండుతున్న ఎండల్లో ప్రజలకు చల్లదనాన్ని పంచుతూ కొండమల్లేపల్లి ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ మానవత్వాన్ని చాటుకుంది. కేఎంపీ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ తరఫున 120 కేజీల పెరుగును అందించి మజ్జిగ పంపిణీ చేపట్టారు. మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్స్ ప్రజలకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేయడం స్థానికులను ఆకట్టుకుంది. వేసవి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని మజ్జిగ అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఆదివారం కావడంతో సుమారు 2500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థికంగా స్థిరంగా ఉన్న ఎంతోమంది సామాజిక సేవలకు ముందుకు రాని ఈ రోజుల్లో ట్రాన్స్‌జెండర్స్ స్వంత ఖర్చులతో సేవా కార్యక్రమం నిర్వహించడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన లాస్య, జయలను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, సైదులు, అలంపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వై టి పి ఎస్ 3వ, యూనిట్‌లో భారీ అగ్నిప్రమాదం

## దగ్ధమైన కేబుళ్ళు, ఆస్తి నష్టం

## 3రోజుల క్రితమే ఉత్పత్తి ప్రారంభించిన 3వ, యూనిట్

**మిర్యాలగూడ, మే 17,( ప్రజాజ్యోతి ):**






నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ( వై టి పి ఎస్ )లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో విద్యుత్ ఆయిల్ లికేజి,షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం.?షార్ట్ సర్క్యూట్ జరిగిన వెంటనే దట్టమైన పొగలు,మంటలు వ్యాపించడంతో ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకుగురయ్యారు. అయితే,అక్కడ విధుల్లో ఉన్న అధికారులు,ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది తక్షణమే స్పందించారు. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ సేఫ్టీ పరికరాల సహాయంతో మంటలను సకాలంలో అదుపు చేశారు.?అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించి మంటలు ఇతర విభాగాలకు వ్యాపించకుండా అడ్డుకోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం కావడం, అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్లాంట్ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. కంట్రోల్ కేబుల్స్,వాల్వ్ లు దెబ్బతిన్నప్పటికీ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా సకాలంలో చర్యలు తీసుకోవటం తో ప్రధాన యంత్రాలకు ముప్పుతప్పిందని సమాచారం. ప్రమాదంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. పంపు వద్ద ఆయిల్ లీకేజీ కావడం, షార్ట్ సర్క్యూట్ జరగటం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనావేసినట్లు సమాచారం. మరిన్ని వివరాల కోసం ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. కాగా మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ సి ఓ డి ( సింక్రోనైజేడ్) పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించారు. స్వల్ప వ్యవధిలోనే ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. గతంలో కూడా యూనిట్ -1 లో అగ్ని ప్రమాదం జరిగి భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. 4000 మెగా యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ లో 8 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం గల 5 యూనిట్లను నిర్మిస్తున్నారు. దీనిలో 1, 2,4వ యూనిట్ల లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాగా, మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ ను ప్రారంభించడం జరిగింది. మిగిలిన 5వ యూనిట్ త్వరలో పూర్తి కానుంది. 29వేల కోట్లతో ప్రారంభించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్ణీత సమయానికి పూర్తి కాకపోవటంతో పాటు, ప్రభుత్వాలు మారటం, యంత్రాల ధరలు పెరగడంతో అంచనామయం దాదాపు 55 వేల కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. దీనికి తోడు ప్రమాదాలు జరుగుతుండడంతో గేయం వంచన మరింతగా పెరిగి ప్రభుత్వానికి గుదిబండలా తయారవుతుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల ముగింపు

**ఆలేరు మే 17 ప్రజాజ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గత వారం రోజుల నుండి నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల ముగింపు సమావేశం ఈ రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల నుండి డిగ్రీ ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా ప్రవేశ పరీక్ష లో ఉత్తమ ర్యాంకులు, సాధించిన విద్యార్థులను సన్మానించారు. కానిస్టేబుల్ ఉద్యోగాన్ని పొందిన వాణి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్ లో సీటు సాధించిన ^. పవన్, కెమిస్ట్రీ లో సీటు దక్కించుకున్న కావేరి, కాకతీయ విశ్వవిద్యాలయం లో తెలుగు ఎంఏ పూర్తి చేసిన అన్నమ్మ, ఎం కం లో సీటు సాధించిన రాజు, బీఈడీ లో సీటు పొందిన విద్యార్థులు సన్మానం పొందిన వారిలో ఉన్నారు. వీరు కళాశాల తో తమకు ఉన్న అనుబంధాన్ని, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ ఎన్. మల్లేశం, ఇతర అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల కు గుర్తింపు తెచ్చిన విద్యార్థుల ను ప్రిన్సిపల్ అభినందించారు.




# ఈనెల 25,26న హైదరాబాదులో..ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభలు

**సంస్థాన్ నారాయణపురం,**

మే 17, (ప్రజాజ్యోతి) : బడుగు బలహీన వర్గాల గొంతుకే ప్రజానాట్య మండలి విధానమని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కొరిమిద్దె శ్రీనివాస్ అన్నారు. ఈనెల 25, 26 తేదీలలో హైదరాబాదులో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాలుగవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ ప్రకటించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రజానాట్యమండలి నాల్గవ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాల నిరంకుశత్వాలు పెరిగినప్పుడల్లా బడుగు, బలహీన, రైతు, కార్మిక, కూలీల గొంతుకలుగా ప్రజానాట్యమండలి కళాకారులు పని చేస్తున్నారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజల కోసం సామాజిక అన్యాయాలపై కళారూపాలతో ప్రభుత్వాలను ప్రజానాట్యమండలి ప్రశ్నిస్తున్నదని వివరించారు. ప్రజల హక్కులను కాపాడుకోవడానికి గ్రామ గ్రామాన విప్లవ గీతాల ఎగా మారి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నదని వివరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు తమ కళారూపాల ద్వారా ప్రభుత్వం ముందు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.



# 25 ఏళ్ల తర్వాత కలిసిన బాల్యమిత్రులు

## ఆప్యాయతలతో ఆత్మీయ సమ్మేళనం

**ఆలేరు, మే 17 (ప్రజాజ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో 2000-2001 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల (బాల్యమిత్రుల) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఇమ్మిడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. దాదాపు 25 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న బాల్యమిత్రులు పరస్పరం ఆప్యాయతలు పంచుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాల రోజుల మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఆచార్యులు బండి రాజుల శంకర్, ప్రసాద్,




వెంకటేష్, సుశీల, రమాదేవి, పద్మలను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పత్తి సతీష్, కుండే సంపత్, పూలేపాక విజయ్, బండారి శ్రీధర్, కుళ్ళ వెంకటేష్, బీదని వెంకటేష్, మొరిగాడి స్వప్న, జన్నె హారతి, వెన్నెల, రహిమత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ వినియోగదారుల రాస్తారోకో

**నెలల తరబడి గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆరోపణ**

**పోలీసుల జోక్యంతో రాస్తారోకో విరమణ**

**సంస్థాన్ నారాయణపురం,**

మే 17, (ప్రజాజ్యోతి) : నెలల తరబడి తమకు సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ వినియోగదారులు ఆదివారం సంస్థాన్



నారాయణపురం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయం ముందు రహదారిపై రాస్తారోకు దిగారు. గత కొన్ని నెలలుగా భారత్ గ్యాస్ వినియోగదారులకు సకాలంలో గ్యాస్ ను సరఫరా చేయడం



లేదని ఆరోపణలు చేశారు. ఎక్కడా లేని విధంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద కొన్ని రోజులుగా పోలీసుల పహారాలో వినియోగదారులకు గ్యాస్ ను అందజేస్తున్నారు. ఆదివారం ఉదయాన్నే వందలాదిమంది వివిధ మండలాలు గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద గ్యాస్ కోసం క్యూ లైన్ లో నిలబడ్డారు. ఉదయం 10 వరకు కూడా కార్యాలయం తీయకపోవడంతో కోపోద్రిక్తులైన వినియోగదారులు రోడ్డుపై బైఠాయించారు. తక్షణమే తమకు గ్యాస్ సరఫరా చేయాలని, గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. నెలల తరబడి తాము గ్యాస్ కోసం పనులన్నీ పక్కనపెట్టి తిరుగుతున్నట్లు ఆరోపించారు. రాస్తారోకో చేయడంతో పలు బస్సులు కార్లు ఇతర వాహనాలు రోడ్డుకు రెండువైపులా నిలిచిపోయాయి. ఒకవైపు ప్రయాణికులు మరోవైపు గ్యాస్ వినియోగదారులు రోడ్డుపై గందరగోళం సృష్టించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారిని పచ్చజెప్పి ఆందోళన ను విరమింప చేశారు. అనంతరం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను పిలిపించి గ్యాస్ సరఫరా చేశారు.

## హిందూ సంప్రదాయ పద్ధతిలో వానరానికి యువకుల నివాళి

**మల్లేపల్లి, మే 17,(ప్రజాజ్యోతి):**

కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఓ వానరం మృతి చెందింది. అటువైపుగా వెళ్తున్న యువకులు వానరం మృతదేహాన్ని గమనించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. హిందువులు వానరాన్ని ఆంజనేయ స్వామి రూపంగా భావించి పూజిస్తారని, అలాంటి వానరం మృతి చెందడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హిందూ సంప్రదాయ పద్ధతిలో వానర మృతదేహానికి కుంకుమ పెట్టి పూలదండలు వేసి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. కాషాయ కండువా కప్పి, కాషాయ జెండా ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వానరానికి తమ చేతుల మీదుగా అంత్యక్రియలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామని యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి భూతరాజు దాసు, కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరుకొండ రాము, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్, నెల్లికంటి గోపి, శివ గౌడ్, సాయి, వెంకటేశ్వర్లు, ఉదయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రమశక్తి అవార్డు గ్రహీత స్వామికి సన్మానోత్సవ కార్యక్రమం




**ఆలేరు మే 17 ప్రజాజ్యోతి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత శ్రమ శక్తి అవార్డు అందుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శారాజిపేట గ్రామానికి చెందిన చిలుకు స్వామికి మే 20 బుధవారం ఉదయం 10 గంటలకు కెసిఆర్ ఫంక్షన్ హాల్ లో సన్మాన మహోత్సవ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి హాజరవుతున్నారని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రచ్చ రామనర్సయ్య ఆదివారం తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొనాలన్నారు.

## చప్పట్ల కార్యక్రమములో ఆరోగ్యమైన జీవితం

**ఆలేరు మే 17 ప్రజాజ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ప్రపంచ చప్పట్ల దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కనకయ్య, నాయకులు గొట్టి పాముల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం 10 నిమిషాలు పాటు చప్పట్లు కొట్టిన జీవితాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని



వారు అన్నారు. గతంలో పూర్వీకులు ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాల ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపారని వారు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, మధు, ఆంజనేయులు, మంచన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# బింగి చంద్రయ్యకు పరామర్శ



ఆలేరు మే 17 ప్రజాజ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ బింగి నరేష్ తండ్రి బింగి చంద్రయ్య ఇటీవల ప్రమాదవ శక్తి తాడిచెట్టు పై నుండి పడి తీవ్రంగా గాయపడగా హైదరాబాదు నాగోల్ లోని పవన్ సాయి హాస్పటల్లో చికిత్స పొందుతున్న సందర్భంగా ఆలేరు మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

# 2009-10 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ.

నడిగూడెం ,మే 17, ప్రజా జ్యోతి:



మండలంలోని కాగిత రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 15 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం నిలిచిపోతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవాలని నిర్ణయించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆటాపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# నడిగూడెంలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నడిగూడెం ,మే 17, ప్రజా జ్యోతి:

స్థానిక శ్రీ కొల్లు పాపయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.అంతా ఒకచోట సమావేశం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.చదువు నేర్పిన గురువులు బిక్షం, సీతారామరావు, జగన్మోహన్, యాదగిరిరావు, అనంతరాములు, హాబీబుద్దీన్, పూర్ణచంద్రరావు, లింగారెడ్డి,బాబురావు, విజయంలక్ష్మి లను ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు.తమ వద్ద చదువు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగడం, పదిమందికి సహాయపడే పదవుల్లో ఉండడం తమకెంతో ఆనందంగా ఉందని గురువులు అన్నారు. విద్యార్థుల ఎదుగుదల వెనక గురువుల పాత్ర ఎంతగానో ఉంటుందన్నారు. చదువుకొని ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుంది అని అన్నారు. తల్లిదండ్రుల సహకారం గురువుల ప్రోత్సాహంతో జీవితంలో మంచి స్థాయికి ఎదిగామని పూర్వ విద్యార్థులు అన్నారు.తల్లిదండ్రుల గురువుల ఆశయాలను నెరవేర్చామన్నారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి అయిన తమ క్లాస్మేట్ దున్నా శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైనందుకు సర్పంచ్ దంపతులను పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుండు విజయరామారావు, శ్రీరాముల నాగేశ్వరరావు, నాగారపు యజ్ఞ నారాయణ,ఆనంద భాస్కర్,మోత్కూరు సత్యనారాయణ, నరసింహారావు,చిలక రమేష్,బీరవల్లి సురేందర్ రెడ్డి,శకుంతల,కొండలమ్మ, మంజు భార్గవి,రాధా, ఉదయమ్మ,బాలాజీ, రాము






నాయుడు,దుర్గాచారి,సైదులు,బుస్సా సురేష్, ఇస్మాయిల్, సైదావతి,సాధిక్ అలీ,కోట సత్యనారాయణ, ఉపేందర్,రాధాకృష్ణ, వందనపు రవి,చంద్రశేఖర్, ముజుబూర్, శ్రీనివాస, గురవయ్య, గురుస్వామి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగారం మే 17 ప్రజా జ్యోతి.



మండల పరిధిలోని వర్ధమానుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరం లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యారుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమ ప్రారంభంలో చదువుల తల్లి సరస్వతి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలను కార్యక్రమాన్ని ప్రారంభించి ,చనిపోయిన ఉపాధ్యాయుల,విద్యార్థుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాడ సానుభూతి వ్యక్తపరిచి మౌనం పాటించారు.ఈ సందర్భంగా విద్యను బోధించిన గురువులను పూల మాలలతో శాలువాతో,జ్ఞాపిక తో సన్మానించారు. 24 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందని అన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆనాటి స్మృతులను గుర్తు చేసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో విద్య బుద్దులు నేర్పిన గురువులు శంభులింగం, లక్ష్మా రెడ్డి,చారి,భాస్కర్ రావు,నారాయణ,యాకయ్య విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సి ఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం

దామరచర్ల, మే 17,( ప్రజాజ్యోతి )::

నల్గొండ జిల్లా ధామరచర్ల మండల కేంద్రం లో ఆదివారం అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటీవల గుంజ రేణుక, నారాయణకు తెలంగాణ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు . రేణుక పుట్టిల్లు దామరచర్ల కావడం గమనార్హం. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వేముల సుధాకర్ మాట్లాడుతూ బీసీ, బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాలనలో దూసుకుపోతున్నారన్నారు. వడ్డెర సమాజ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరంచిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దామరచర్ల మండల నాయకులు ఓర్సు బిక్షమయ్య అధ్యక్షతన కుల పెద్దలు, యువ నాయకులు మరియు సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు పట్ల హర్షం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్ వేముల వీరేశం లకు పాలాభిషేకం

చిట్యాల మే 17(ప్రజాజ్యోతి ప్రతినిధి):

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ ఉద్యమకారులలో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ప్రభుత్వ విప్ వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తుండటం అభినందనీయమన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, గృహ పథకాలు, విద్యా మరియు వైద్య సదుపాయాలలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక కోటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు సముచిత గౌరవం మరియు న్యాయం జరుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కట్టుబడి





ఉండాలని, ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించి శాశ్వత విధానాలు రూపొందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు జోగు లింగస్వామి, కొనసం అశోక్ యాదవ్, చికిలంమెట్ల మెహర్ బాబు,బాస్వాజు రామాచారి, అమరోజు వెంకన్న, జిల్లాపల్లి స్వామి, జోగు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్, పెట్రోల్ ధరల పెంపుకి నిరసనలు తెలిపిన బిఆర్ఎస్ శ్రేణులు



పాలకవీడు, మే 17(ప్రజా జ్యోతి ):

కేంద్ర ప్రభుత్వం సామాన్యుల మెడకు గుదిబండ అయింది అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమల్ల సతీష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను నిరసిస్తూ ఆదివారం రోజు పాలకీడు మండల కేంద్రంలో ప్రయాణికులు కూర్చున్న ఆటోను తాడుతో లాగి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పన్నుల రూపంలో ఈ దేశ ప్రజల డబ్బును వసూలు చేస్తూ పేద ప్రజలను, నిత్యవసర వస్తువుల మీద ధరలను వేస్తూ నిండా ముంచుతుంది అని అన్నారు. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరల గురించి మౌనం పాటించడం చాలా సిగ్గుచేటు అని అన్నారు. నరేంద్ర మోడీ జిడిపిని పెంచుతా అని చెప్పి గ్యాస్ డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతున్న దుర్మార్గపు ప్రభుత్వం ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. ఇప్పటికైనా పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను వెనక్కి తీసుకొని బిజెపి పార్టీ స్థాయిని నిలబెట్టుకోవాలని కోరారు.ధరలు తగ్గించని పక్షంలో మా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టబోతొందని అని హెచ్చరించారు ఇట్టి కార్యక్రమంలో కొండలు. హరినాయక్, వెంకన్న. కరుణాకర్. కోటేష్ .నాగేష్. కాశయ్య .వీరబాబు. నాగేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

# వరి కోతల తర్వాత పొలాన్ని, కొయ్యలు, కాల్చొద్దు భూసారానికి తీవ్ర నష్టం ..వ్యవసాయ అధికారి గిరిబాబు

చిట్యాల మే 17(ప్రజాజ్యోతి ప్రతినిధి):

వరి కోతల తర్వాత పొలాల్లోని కొయ్యలు, గడ్డిని తగలబెట్టడం పర్యావరణానికి, భూసారానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు హెచ్చరించారు. రైతులు ఈ చర్యను వెంటనే నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల మట్టిలోని తేమ ఆవిరైపోతుంది, మిత్రపురుగులు నశిస్తాయి, మరియు మట్టి గట్టిపడి దున్నడం కష్టమవుతుంది. పొగ, బూడిద వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. ?ప్రత్యామ్నాయాలు: వరి కొయ్యలను చిన్న ముక్కలుగా చేసి, డీకంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్ సాయంతో భూమిలో కలిపి దున్నితే అది సేంద్రియ ఎరువుగా మారుతుంది. అని అన్నారు. వరికోయ్యలను వీటిని పశువుల మేత, వర్మి కంపోస్ట్, బయోగ్యాస్, పుట్టగొడుగుల (మష్రూమ్) సాగు, పేపర్ మరియు బయో ఇంధన తయారీలో ఉపయోగించవచ్చు. ?వరి కొయ్యలను తగలబెట్టడం చట్టరీత్యా నేరమని, రైతులు ఈ విధానాన్ని మానుకొని భూసారాన్ని రక్షించుకోవాలని ఆయన కోరారు.

# సత్తా చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మానం

చింతలపాలెం, మే 17 (ప్రజా జ్యోతి):

పట్టుదలతోనే విజయాలు సాధ్యమయ్యాయని చింతలపాలెం మండల విద్యాధికారి నారపరాజు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డి. శ్రావ్య (525), వేద మల్లిక (521), ముబీనా (514), మానస (507)లను అభినందించారు. అదే విధంగా మండలంలో అత్యధిక ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేసిన వి.



శ్రీనివాసచారి (ఎస్జీటీ, ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ దొండపాడు), 100 శాతం ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ సాధించిన ఎంపీపీఎస్ కొత్తగూడెం విద్యార్థి నరేష్‌ను ఎంఈఓ, హెడ్‌మాస్టర్ ఎన్. శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సోందు మియా, మక్బూల్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి నాల్గవ మహాసభల వాల్ పోస్టర్లు విడుదల

మిర్యాలగూడ, మే 17, ( ప్రజాజ్యోతి ):

మిర్యాలగూడ సిపిఐ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ప్రజానాట్యమండలి హైదరాబాద్ నారాయణగూడలో జరిగే 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, పి ఎన్ ఎం జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు లు మాట్లాడుతూ కళ కల కోసం కాదు కళ ప్రజల కోసం అనే ఆశయంతో అమరుల ఆశయాలను పునికిబుచ్చుకొని ఇప్పుడుప్రజానాట్యమండలి గ్రామ గ్రామాన తిరిగి ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగి పోతాఉన్నదన్నారు.ఈ తరుణంలో మండల జిల్లా రాష్ట్ర మహాసభలు జరుపుకొని మళ్ళీ ప్రజలను చైతన్యం పరిచే దిశగా నడవాలన్నారు. ఆనాడు బిఆర్ఎస్ కళాకారులను గుర్తించి వారికి కావలసిన సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పి నేటి వరకు కూడా అమలు చేయకపోవడం చాలాదురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను గుర్తించి రాష్ట్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలన్నారు. జిల్లా కేంద్రంలో మినీ రవీంద్రభారతి ఏర్పాటు చేయాలి, వృద్ధ కళాకారులకు పెన్షన్ 3,000 నుండి 6,000 పెంచాలి, కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్టు కేటాయించాలి, కళాకారులకు ప్రయాణానికి ఆర్టీసీ బస్సు, రైల్లలో రాయితీ కల్పించాలి, కళాకారులను దేవాలయాల్లో కళా ప్రదర్శనలకు అవకాశం కల్పించాలి నియోజకవర్గానికి ఒక మినీ ఆడిటోరియం నిర్మించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులకు అవకాశం కల్పించాలని డిమాండ్లతో మహాసభలో చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మిర్యాలగూడ కార్యదర్శి వెన్నెల వెంకన్న, వేములపల్లి సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, ప్రజానాట్యమండలి నాయకురాలు డి.శాంతి, హెచ్ రవి, కలకొండ శ్రీనివాసు, జ్యోతి, బంటు బుచ్చయ్య పాల్గొన్నారు.



# పెట్రో ఉత్పత్తుల ధరల పెంపుకు నిరసనగా సిపిఎం నిరసన,ధర్నా



**వేములపల్లి ,మే 17, ( ప్రజాజ్యోతి ):**

వేములపల్లి మండలం కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా చేశారు. పెట్రో ఉత్పత్తులపై ధరలు పెంచమని ప్రగల్బాలు పలికిన మోడీ ప్రభుత్వం ధరలు ఎలా పెంచారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాదురి శశిధర్ రెడ్డి, రండి శ్రీను, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేముడాల పరశురాములు రైతు సంఘం నాయకులు పాల్వాయి రామ్ రెడ్డి, పెంటమల్ల సుకన్య మల్లయ్య పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**హాలియా,మే17(ప్రజా జ్యోతి)**

హాలియా పట్టణంలోని ఆదిత్య కేర్ హాస్పిటల్‌లో నల్గొండ రివర్ హాస్పిటల్, స్థానిక ఆదిత్య కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ నులక రవీందర్ రెడ్డి డాక్టర్ సమత తూప్రాన్ ల ఆధ్వర్యంలో సుమారు100 మంది రోగులను పరీక్షించారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా క్రియాటిన్,షుగర్,బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. కిడ్నీ సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తిస్తే ఆరోగ్య సమస్యలను నివారించ



వచ్చని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్ను వీరా రెడ్డి, చెన్ను నర్సిరెడ్డి, రిక్కల ధనంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగ దేవమ్మ ఉత్సవాలు ప్రారంభం.



**నాగారం మే 17 ప్రజా జ్యోతి.**

నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా లో ఆదివారం గంగా దేవమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తెప్పను గ్రామంలోని పెద్దగోళ్ల ఇంటి నుండి గంగాదేవమ్మ తల్లి గుడి వద్దకు మేళ తరాలతో తీసుకెళ్లి నీటిలో వదిలారు. అనంతరం గంపలు పూజించుకొని భక్తి తో భక్తులు తల్లికి బోనాని కి కావలసిన సమానం ను గంపలో తీసుకెళ్లి తల్లి ఆలయం లో సమర్పించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ బయ్యం సుజాత వెంకన్న పెద్ద గొల్ల చీమల లింగయ్య సారి గొల్ల కన్నెబోయిన వెంకటయ్య ు పాల్గొన్నారు.

### మర్రిగూడలో జిల్లా ఎస్పీకి పాలాభిషేకం

**మర్రిగూడ,మే 16(ప్రజాజ్యోతి):**



మర్రిగూడ ఎస్ఐని బదిలీ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మర్రిగూడ మండలంలోని ఎస్సై బాధితులు ఆదివారం చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ చిత్రపటాని కి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చారు. మాజీ ఎంపిటిసి చిలువేరు విష్ణు, అచ్చిని సైదులు, కెవి గౌడు, మాధగోని మహేష్ , అచ్చినిబాలరాజు, పంతంగి సాయి, నడిమింటి శ్రీను, వరిగ రమేష్, అంబల్ల వెంకటేష్, చిర్రగోని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి వైఖరి నిరసిస్తూ తల్లి మృతదేహంతో కూతుళ్ళ ఆందోళన

## అద్దంకి- నార్కెట్ పల్లి రహదారిపై బైటాయింపు


## పెద్ద ఎత్తున నిలిచిన వాహనాలు



**దామరచర్ల, మే 17,( ప్రజాజ్యోతి ):**

ఆనారోగ్యం తో కన్నతల్లి మరణిస్తే...కనీసం పట్టించుకోని తండ్రి వైఖరికి నిరసనగా.. కుమార్తెలు తల్లి మృతదేహంతో దామరచర్ల మండల





కేంద్రంలో ఆదివారం జరిగింది. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన బైరం శ్రీకాంత్ సువార్త లక్ష్మిలు దంపతులుకాగా వారికి కుమార్తెలు నీరజ, నిస్సి లు వున్నారు. కొన్ని నెలలుగా దంపతుల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో శ్రీకాంత్ కొన్ని ఏళ్లుగా భార్య పిల్లలకు దూరంగా ఉంటున్నాడని, విడాకులకోసం కోర్టుకు ఎక్కాడని సమాచారం. మరో మహిళతో కలిసి ఉంటున్నాడని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో లక్ష్మి ఆదివారం మృతి చెందింది. అయినప్పటికీ శ్రీకాంత్ రాకపోవడంతో కొపొద్రిక్తులైన కుమార్తెలు, బంధువులు అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై మృతదేహంతో బైఠాయించి న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతమవుతూ,తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేదంటూ రహదారిపై బైఠాయించారు. ఈ ఆందోళనతో అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుమార్తెలు, కుటుంబ సభ్యులతో ఎస్సై మాట్లాడారు. చట్టపరంగా భర్త శ్రీకాంత్‌పై చర్యలు తీసుకుంటామని, పిల్లలకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని ఎస్సై హామీ ఇచ్చారు. పోలీసుల నచ్చజెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి, మృతదేహాన్ని తరలించారు.

# కళ్ళల్లో కారం జల్లి తల్లి కూతురు హత్య





**హాలియా,మే17(ప్రజా జ్యోతి)**

ఆస్తి కోసం తల్లి కూతురును హత్య చేసిన సంఘటన నల్లగొండ జిల్లా అనుముల మండల పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత (40) రుద్రాక్షి లావణ్య (20) లను కిరాతంగా హత్య చేశారు. గత కొంతకాలంగా సమీప బంధువులతో ఆస్తి తగాదాలు నేపథ్యంలోనే హత్యలు జరిగి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఆదివారం ఉదయం సుమలతకు చెందిన బత్తాయి తోటలో కాయలు కోసేందుకు కూతురుతో కలిసి రావడంతో నిందితులు పథకం ప్రకారం కాపు కాసి దాడి చేసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో తల్లి కూతుళ్ళ పై దాడి చేసి దుండగులు కళ్ళల్లో కారం జల్లి చున్నీతో మెడను గట్టిగా బిగించి అత్యంత కిరాతకంగా హత్య చేశారు. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు పోలీసులు క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

